సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ౹ 28 ౹ అక్టోబర్ ౹ 2024



భార్య గొంతు కోసిన భర్త

భార్యపై అనుమానం పెంచుకున్న భర్త బ్లేడ్‌తో.. ఆమె గొంతు కోసిన సంఘటన ఆదివారం జమ్మలమడుగులో చోటుచేసుకుంది. చర్చిలో ప్రార్థన చేస్తుండగా ఈ ఘటన జరిగింది. -8లో



దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. - 8లో

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం 34.6 /24.2

జిల్లాలో ఆదివారం 24.2 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

రైలు కూత ఎప్పుడో..!

- కలగా మిగిలిన సొరంగమార్గ ప్రయాణం
- ఐదేళ్లుగా ప్రయాణం కోసం ఎదురుచూపులు
- ప్యాసింజర్ రైళ్లు నడపని రైల్వేశాఖ





➡ దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే టన్నెల్

ఓబులవారిపల్లె : ఉమ్మడి కడప జిల్లా నుంచి నేరుగా రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు రైలు సౌకర్యం లేదు. తిరుపతి జిల్లా రేణిగుంట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంది. అన్నమయ్య జిల్లా, రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా కృష్ణపట్నం వరకు 133 కిలో మీటర్లు రూ. 2 వేల కోట్ల వ్యయంతో నూతన రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా నందలూరు మండలం హస్తవరం నుంచి కృష్ణపట్నానికి రైలు మార్గం సర్వే నిర్వహించగా ఓబులవారిపల్లె నుంచి దూరం తగ్గడంతోపాటు అనుకూలంగా ఉంటడంతో ఈ మార్గాన్ని అధికారులు ఖరారు చేశారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు రైల్వే శాఖవారు నేరుగా ప్యాజింజర్ రైలును నడపించడం లేదు.

అడియాసలే..

2019 జూన్ 15వ తేదీన కృష్ణపట్నం మార్గంలో మొట్ట మొదట ట్రయల్‌రన్‌గా గూడ్సురైలును నడిపించారు. కొన్నేళ్లుగా కడప జిల్లా నుంచి నెల్లూరు జిల్లాకు ఓబులవారిపల్లె–కృష్ణపట్నం రైలు మార్గం కోసం రెండు జిల్లాల ప్రజలు ఎదురు చూశారు. నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నెల్లూరు జిల్లాలోని తన సొంత గ్రామం మీదుగా ఈ రైలు మార్గం కోసం అప్పట్లో కృషి చేసి ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే సొరంగ మార్గంలో ప్రయాణించాలని దాదాపు ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి కడప జిల్లా, నెల్లూరు జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయితే రైల్వే శాఖవారు ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ప్రవేశ పెట్టలేదు. దీంతో సంవత్సరాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న టన్నెల్ ప్రయాణం కలగానే మిగిలిపోయింది. ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ఏర్పాటు చేస్తే ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. అంతే కాకుండా రాష్ట్ర రాజధానికి నేరుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.

సరుకు రవాణా కోసమే కృష్ణపట్నం రైలు మార్గం

ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు రైలు మార్గం కేవలం గూడ్స్‌రైలు కోసమే ఏర్పాటు చేశారు. గతంలో రేణిగుంట నుంచి కృష్ణపట్నం పోర్టుకు గూడ్స్‌రైళ్లు ప్రయాణించాలంటే దూరంతో పాటు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండేవి. ఈ మార్గాన్ని సర్వేచేసి ఏర్పాటు చేయడంతో దూరంతో పాటు రైళ్ల రద్దీ కూడా తగ్గింది. నిత్యం దాదాపు 15 నుంచి 20 గూడ్స్ రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. షిప్పుల ద్వారా విదేశాలకు సరుకులు ఈ మార్గంలో రవాణా చేస్తున్నారు. మార్గ మధ్యంలో పలు రైల్వే స్టేషన్లు ఉన్నా కేవలం సిగ్నల్ వ్యవస్థ మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు వీలుగా రైల్వేస్టేషన్‌లు ఇప్పటికీ నిర్మించలేదు. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు ఈ మార్గంలో నెల్లూరుకు డెమో ప్యాసింజర్ రైళ్లను నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం రైలు మార్గం 2005–2006వ సంవత్సరంలో మంజూరైంది. ఈ మార్గం మధ్యలో చిట్వేలి మండలం చెర్లోపల్లె వద్ద అటవీ ప్రాంతంలో కొండ వద్ద దాదాపు 6.6 కిలో మీటర్ల పొడవు, 1.5 కిలో మీటర్ల పొడవుతో రెండు సొరంగ మార్గాలను ఆర్‌వీఎన్‌ల్ సంస్థ ఆస్ట్రేలియన్ టెక్నాలజీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఇది దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే సొరంగ మార్గం. లోపల వెలుతురు, ఆక్సిజన్ వచ్చేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రత కల్పించారు. భారతదేశంలో అతి పెద్ద రైల్వే సొరంగ మార్గం 11.21 కిలో మీటర్ల జమ్మూ కాశ్మీర్‌లోని పీర్‌పంజాల్‌లో ఉంది.

రైల్వేశాఖ మంత్రి దృష్టికి..



కృష్ణపట్నం మార్గంలో ఓబులవారిపల్లె మీదుగా నెల్యూరుకు ప్యాసింజర్ రైలు నడపాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లాము. ఆయన సానుకూలంగా స్పందించారు. రైల్వేశాఖ అధికారులు స్పందించి ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ప్రవేశపెట్టాలి.

– తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, గుంతకల్లు రైల్వేబోర్డు కమిటీ మాజీ సభ్యులు

టన్నెల్ ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నాం..



దక్షిణ భారతదేశంలో అతి పెద్ద టన్నెల్ మార్గం మనకు దగ్గరలో ఉండి కూడా ప్రయాణం చేయలేకుండా ఉన్నాము. దాదాపు ఐదేళ్లుగా ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. ప్యాసింజర్ రైలు కోసం సంవత్సరాలుగా వేచి ఉన్నాం. ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు స్పందించి టన్నెల్ మార్గంలో డెమో రైలు నడిపించాలి.

– శ్రీరామ సుధాకర్, ఉపాధ్యాయుడు, ఓబులవారిపల్లె.

రాజధానికి నేరుగా రైలు సౌకర్యం కల్పించండి



ప్రస్తుతం రాష్ట్ర రాజధానికి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరు జిల్లా రేణిగుంట మీదుగా వెళుతుంది. కృష్ణపట్నం రైలు మార్గంలో విజయవాడకు నేరుగా రైలు ఏర్పాటు చేస్తే దూరం తగ్గడంతో పాటు నేరుగా ఉమ్మడి జిల్లా ప్రజలకు రైలు సౌకర్యంగా ఉంటుంది. రైతులకు, వ్యాపారులకు ఈ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా ప్రయోజనం కలుగుతుంది.

– పున్నాటి ఈశ్వర్‌రెడ్డి, రైతు, ఓబులవారిపల్లె.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి 08562–244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవలసినదిగా ఇన్‌ఛార్జి కలెక్టర్ తెలియజేశారు.

పదోన్నతులకు సర్వీస్ నిబంధనలు తీసుకురావాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో ఎంఈఓ నుంచి ఆర్‌జేడీ వరకు ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చేలా సర్వీసు నిబంధనలు తీసుకరావాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనానుభవం ఉన్నవారు మాత్రమే పాఠశాలల పర్యవేక్షణ అధికారులుగా ఉంటే విద్యాశాఖ మరింత పురోభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే గొడుగు కిందికి తెచ్చి 73 ,74 రాజ్యాంగ సవరణలు అమలులోకి తెచ్చి ,సర్వీస్ నిబంధనలు తేవాలని డిమాండ్ చేశారు. స్కూల్ అటెండెన్స్ యాప్ పనిచేయడంలో అవాంతరాలు ఉన్నాయని వీటిని సరిచేయాలని విద్యాశాఖను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు ఉమాకాంత్, సాయి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



ఉల్లి పంట వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు

మైదుకూరు : ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఆదివారం సంఘం నాయకులు పలువురు ఉల్లి రైతులను కలిసి వారి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ క్వింటాల్ ఉల్లిగడ్డలను రూ.1000 కూడా కొనే నాథుడే లేక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. మైదుకూరు నియోజకవర్గం, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో 5వేల ఎకరాలకుపైబడి ఉల్లి పంటను రైతులు సాగు చేశారన్నారు. మే నెల చివరిలో వేసిన పంట మంచి దిగుబడితో పాటు, ధర రూ.3వేలు నుంచి రూ.3,500 దక్కడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు పోను కొంత ఆదాయం వచ్చిందన్నారు. అయితే జూన్ నెల చివరిలో వేసిన ఉల్లి పంట వర్షాలకు దెబ్బతిని సరైన దిగుబడి రాలేదన్నారు. దానికి తోడు ధర పడిపోవడంతో రైతులు కుదేలయ్యారని పేర్కొన్నారు. ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేయించి క్వింటాల్ రూ.2,500 ధర పలికే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పెద్ద పుల్లయ్య, ఎస్.సుబ్బారెడ్డి, కొమ్మినేని లక్ష్మయ్య, రామ్మోహన్, సుబ్బరాయుడు, వెంకటరమణ, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే రాజ్యాధికారం

– సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

రాయచోటి అర్బన్ : రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాటాన్ని నడపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కేజీఎస్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలు జరిగాయి. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. బూర్జువాలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల చేతుల నుంచి శ్రామిక, కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, పెత్తందారి ధోరణి కారణంగానే ఇజ్రాయిల్– పాలస్తీనా, రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు రామాంజులు, రవికుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహులు తదితరులు మాట్లాడారు.

విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలి

కడప కల్చరల్ : మన దేశ జాతీయ పతాకం సగర్వంగా రెపరెపలాడాలంటే ఇన్‌స్రూ బ్యాంకింగ్, కోల్, స్టీల్, రైల్వే, బీఎస్ఎన్ఎల్, డిఫెన్స్, విద్యుత్ ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనం చేయడం కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశానికి ఎందుకు అవసరం?' అనే అంశంపై జరిగిన సెమినార్ లో ఆయన మాట్లాడారు. అన్ని సంక్షోభాల నుండి భారతదేశాన్ని ప్రభుత్వ రంగమే కాపాడిందన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలకు కేవలం వ్యవసాయ సంక్షోభమే కారణం కాదన్నారు. విద్య వైద్య రంగాలు ప్రైవేటీకరణకు గురి కావడం రైతుల జీవితాల్ని ఛిద్రం చేయడంతో బతకలేక, దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను, అమరావతిని కార్పొరేట్ సంస్థల ద్వారా అభివృద్ధి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెప్పే మాటలు అసంబద్ధమని, ఇందుకు ప్రభుత్వ రంగ సంస్థలే శరణ్యమన్నారు. ఒకప్పుడు బాగా వెనుకబడిన విశాఖపట్టణం గొప్ప ఆర్థిక రాజధానిగా ఈ మూడు దశాబ్దాలలో రూపాంతరం చెందడం ఇందుకు సజీవ ఉదాహరణ అని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘాల నాయకులు రఘునాథ్ రెడ్డి, వసుప్రద, శంకర్రావు, మహేశ్వర్ రెడ్డి, సంజయ్, నిత్యానంద రెడ్డి (ఇన్సూరెన్స్), శ్రీనివాసుల రెడ్డి (సీఐటీయూ), లక్ష్మీ రాజా (యూటీఎఫ్), సుధాకర్, సుబ్బారావు (బీఎస్ఎన్ఎల్), అజీజ్, సాయికుమార్ (బ్యాంకింగ్), శివశంకర్ (విద్యుత్), సుబ్బారెడ్డి (పోస్టల్), రమణ (ఎస్సీ అధికారుల సంఘం), ఆచార్య రాంప్రసాద్ రెడ్డి (వైవీయు), నరసింహారెడ్డి (జేవీవీ), దస్తగిరి రెడ్డి (రైతు) పాల్గొన్నారు. వీరితో పాటు ఎల్ఐసీ యూనియన్ నాయకులు అక్బర్, సుధీకర్, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, రాజు, రత్నకిషోర్, రఘు, కుమార్, చిన్నయ్య, సాదిక్, శ్రీనివాసులు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఉమేష్‌చంద్ర కళ్యాణ మండపంలో అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ(ఉస్మా) జిల్లా అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల విద్యా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు రెండూ మాకు రెండు కళ్లలాంటివన్నారు. ప్రవేటు పాఠశాలలకు సంబంధించిన సమంజసమైన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల గుర్తింపునకు సంబంధించిన గడువును 10 సంవత్సరాలకు పొడిగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ తీసుకునే నిర్ణయాలలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ వారిని భాగస్వాములను చేస్తామన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ జిల్లా అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల సమస్యల విషయంలో విద్యార్థి, కుల సంఘాల జోక్యం లేకుండా చూడాలన్నారు. ప్రధాన కార్యదర్శి టక్కోలి రమేష్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, జేఏసీ ఛైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, గౌర వాధ్యక్షుడు వివేకానందరెడ్డి, ఉస్మా నాయకులు పాల్గొన్నారు.

నేరాల కట్టడిలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



మర్చంట్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : నేరాలను నిరోధించడంలో, నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైనదని, షాపుల, వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోకి వ్యాపారులు తమ వంతుగా సామాజిక బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. ఆదివారం స్థానిక «పెన్నార్» పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వివిధ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్యాపారులకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. ఎక్కువమంది గుమికూడే ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. మునిసిపల్ కార్పోరేషన్లు, మునిసిపాలిటీలలో ఈ చట్టం వర్తిస్తుందన్నారు. రికార్డయిన సీసీ ఫుటేజీ వీడియోలు 30 రోజులపాటు నిల్వ వుండేలా చూడాలన్నారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వున్న షాపుల సీసీ కెమెరాలను రోడ్డు వైపు తిప్పి ఉంచాలన్న పోలీసుశాఖ సూచన మేరకు దాదాపు 1700 సీసీ కెమెరాలను రోడ్డు వైపు తిప్పడం సత్ఫలితాలు ఇచ్చిందని ఎస్పీ తెలిపారు. కడప నగరంలో ఓ వ్యక్తిపై దాడి కేసులో ద్విచక్ర వాహనాల నంబర్లు, నిందితుల ఆనవాళ్లను గుర్తించడంలో సమీపంలోని షాపుల సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు. ఓ చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేయడంలో కూడా సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరించాయన్నారు. జిల్లా అంతటా రెండు నెలల వ్యవధిలో వీలైనన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేర రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ భాగస్వాములు కావాలనీ విజ్ఞప్తి చేశారు. వ్యాపార వర్గాల వాట్సాప్ గ్రూపుల్లో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని భాగస్వామిగా చేసి మీ సమస్యలు ఏమైనా వుంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ బి. హేమకుమార్, కడప ఒన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ, టూటౌన్ సీఐ బి. నాగార్జున, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్ రెడ్డి, జిల్లాలోని క్లాత్ మెర్చంట్స్, గోల్డ్ షాప్స్, ఫాన్సీ, కిరాణా, లారీ అసోసియేషన్, ఆయిల్ మిల్, బిల్డింగ్ వర్కర్స్, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సినిమా థియేటర్ల అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

పత్తి రైతులకు నిరాశ!

- పత్తి కొనుగోలు కేంద్రం ఏదీ..?
- నెల రోజులు అవుతున్నా ప్రారంభం కాని కొనుగోళ్లు
- ఎదురు చూస్తున్న అన్నదాతలు



గోపవరం గ్రామంలో రైతు ఇంట నిల్వ ఉన్న పత్తి


ప్రొద్దుటూరు : జిల్లాకు సంబంధించి ప్రొద్దుటూరులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తద్వారా తమకు ఊరట కలుగుతుందని రైతులు భావించారు. అయితే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని దాదాపుగా నెల రోజుల క్రితం అధికారులు ప్రకటించినా ఇంత వరకు దాని ఊసే లేదు. అమ్మకాల కోసం గ్రామాల్లోని రైతులు ఎదురుచూస్తున్నారు.

జిల్లాకు సంబంధించి జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి ఏటా పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో పెద్ద మొత్తంలో పత్తి పంట సాగైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్వింటాల్ పత్తి రూ.10వేల ధరకు చేరింది. ధరలు బాగుండటంతో ఈ ఏడాది కూడా ఎక్కువగా పత్తి సాగు చేశారు. నెల రోజుల క్రితం క్వింటా రూ.7,500 వరకు ఉన్న పత్తి ప్రస్తుతం రూ.6,200 చేరింది. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. గతంలో ఎకరాకు 20 క్వింటాళ్ల పత్తిని రైతులు పండించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం 10 క్వింటాళ్లు కూడా పండడం లేదు. పైగా గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎకరా పత్తి పంట సాగుకు రూ.70వేల వరకు ఖర్చవుతోంది. ఈ పరిస్థితుల కారణంగా పత్తి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. గిట్టుబాటు ధర మాత్రం రైతులకు లభించడం లేదు.

గత నెలలోనే ప్రకటించిన అధికారులు

రైతుల సమస్యను గుర్తించిన ప్రభుత్వం ప్రొద్దుటూరులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మార్కెటింగ్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. నాణ్యతా ప్రమాణాలను బట్టి క్వింటాల్ పత్తి కనీస మద్దతు ధరను ప్రభుత్వం రూ.7,521 ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పత్తి కొనుగోలుకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆర్భాటంగా అధికారులు ఏర్పాటు చేశారు. రైతులు రోజూ మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చి కొనుగోళ్లపై ఆరా తీస్తున్నారు. ఇదిగో.. అదిగో అని అధికారులు రైతులను తిప్పి పంపుతున్నారు. ఈ విషయంపై ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యదర్శి రత్నరాజును సాక్షి వివరణ కోరగా ప్రొద్దుటూరులో రెండు మాత్రమే కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయని తెలిపారు. వారు తమకు ధర గిట్టుబాటు కావడం లేదని వేలంలో పాల్గొనడం లేదన్నారు. నంద్యాలకు చెందిన బీసీజీ కాటన్ ఇండస్ట్రీస్ వారు వేలంలో పాల్గొన్నారన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటే ప్రొద్దుటూరు నుంచి నంద్యాలకు పత్తిని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇదే విషయంపై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి రమేష్‌ను సాక్షి వివరణ కోరగా దీపావళి పండుగ తర్వాత కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు.


పత్తి రైతులు నష్టపోయారు



ఈ ఏడాది పత్తి పంటను నమ్మి సాగు చేసిన రైతులు నష్టపోయారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది దిగుబడి తగ్గిపోవడంతోపాటు ధర కూడా లేదు. పంట సాగుకు చేసిన ఖర్చులను లెక్కవేస్తే నష్టమే వస్తోంది. కనీసం కొనుగోలు కేంద్రం ద్వారా అయినా రైతులకు కాస్త ఊరట కలుగుతుంది అనుకుంటే ఇంతవరకూ దాని ఊసేలేదు.

– లాలూసా, కౌలు రైతు, గోపవరం గ్రామం, ప్రొద్దుటూరు మండలం

కొనుగోళ్లను ప్రారంభించాలి



ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. గిట్టుబాటు ధర లేని కారణంగా పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది పంట దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోయింది. వెంటనే అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

– గుద్దేటి రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, రాజుపాళెం

నవంబర్ 27 నుంచి ఏఐఎస్‌ఎఫ్ మహాసభలు



మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వతేదీ వరకు సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం కన్వీనర్ భవిత, నియోజకవర్గ కార్యదర్శి వినయ్, సహాయ కార్యదర్శి భానుప్రసాద్, ఇలాహి, కార్తీక్, షారుక్, హర్ష, నవదీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న కనకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ యు.వై.జయరాములు తెలియజేశారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ తమ సిబ్బందితో కలిసి వెళ్లి ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 18 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



మహేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట మహేశ్వర్‌రెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. టీడీపీ నాయకులు దాడి చేశారని వెంకట మహేశ్వరరెడ్డి గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో టీడీపీ నాయకులు మా పైనే పోలీసులు ఫిర్యాదు చేస్తావా అని శుక్రవారం మళ్లీ దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన గాయపడి స్థానిక వైఎస్సార్ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్‌తో కలిసి ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీడీపీ నాయకులు దాడులు చేసినా, బెదిరించినా వైఎస్సార్‌సీపీ నాయకులు కానీ, కార్యకర్తలు కానీ భయపడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపడం తగదు

ఖాజీపేట (చాపాడు) : ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం తగదని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టులోని తన స్వగృహంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల రూపంలో రూ.6.072 కోట్లను ప్రజలపై భారం మోపిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కావున ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

షర్మిలమ్మ దిగజారొద్దు : తెలుగు ప్రజల్లో అన్న బాగు కోరేది చెల్లెలని.. కానీ వైఎస్ జగన్ రాజకీయ పతనానికి ఎవరితోనైనా చేతులు కలిపే పీసీసీ అధ్యక్షురాలు షర్మిలమ్మ లాంటి చెల్లెలు మాకొద్దని ప్రతి తెలుగు లోగిలి అనుకునే స్థాయికి దిగజారొద్దని ఆయన హితువు పలికారు. ఈ కార్యక్రమంలో సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు చీపాటి చంద్ర మహేశ్వర్‌రెడ్డి, శీలం రమణారెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి సోయగం..
పాలకొండల సొంతం

ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది పాలకొండల ప్రాంతం. పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులను అబ్బుర పరుస్తోంది. కడప నగరానికి సమీపంలో ఉన్న పాలకొండలు.. జలపాతాలతోపాటు గుట్టలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తోంది. వర్షాలు వచ్చినప్పుడు జలపాతాలు పారుతున్న సుందర దృశ్యాలు ఆస్వాదించవచ్చు. కొండపై నుంచి చూస్తే నగరం మొత్తం కనిపిస్తోంది. మరి ఏ ప్రాంతంలో కూడా ఇలాంటి సౌకర్యాలు లేకపోవడంతో నగర ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి జనం ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు.

– మహమ్మద్ రఫీ,
సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప









సేవా కార్యక్రమాల్లో మానవత ముందంజ

106 మందికి కృత్రిమ అవయవాల కోసం కొలతలు



కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీసుకుంటున్న నిపుణులు

ప్రొద్దుటూరు కల్చరల్ : సేవా కార్యక్రమాల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్ల పేట సరస్వతీ విద్యామందిరంలో ఉన్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాల కోసం కొలతల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాఖల్లో దాదాపు 65 వేల మంది సభ్యులతో సేవాలందిస్తున్నామన్నారు. ఉచిత ఫ్రీజర్ బాక్స్‌లు, వైకుంఠ రథం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 106 మంది దివ్యాంగుల నుంచి కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీసుకున్నామన్నారు. మానవత స్థానిక చైర్మన్ కళావతి, ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం నాలుగు సార్లు ఉచిత కృత్రిమ అవయవాల శిబిరం నిర్వహించామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రతినెల దివ్యాంగులకు రూ.700 వంతున 50 మందికి, వికాస్ విహార్ మానసిక వికలాంగ చిన్నారులకు 40 మందికి రూ.500లను దాతల సహకారంతో అందిస్తున్నామన్నారు. జైపూర్ కాలు, చేయి కోసం కొలతలు తీసుకున్న వారికి డిసెంబరు 15న కృత్రిమ అవయవాలను అమర్చనున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులకు, వారి కుటుంబ సభ్యులకు సంస్థ ఆధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన దాత సన్నుతి శ్రీనివాసులు, మానవత డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, మానవత సంస్థ, ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్ మహవీర్ లింబ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీ కాలువలో పడి మహిళ మృతి



చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం వద్ద గల కేసీ కాలువలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికుల సమాచారంలో పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దువ్వూరు మండలం మదిరేపల్లెకు చెందిన మహిళగా గుర్తించారు. అమ్మిరెడ్డి వీరారెడ్డి భార్య అమ్మిరెడ్డి నాగలక్షుమ్మ(40)గా కనుగొన్నారు. ఆమె కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతుండేది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం దువ్వూరు వద్ద గల కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయింది. చాపాడు మండల పరిధిలోని మొర్రాయిపల్లె కాలువ ద్వారా విశ్వనాథపురం వద్ద కేసీ కాలువలో మృతదేహం బయటపడింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

నిత్య కృషీవలుడు కాశీవరపు వెంకటసుబ్బయ్య

'తుమ్మెద పదాలు' పుస్తకావిష్కరణలో ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి



తుమ్మెద పదాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు, రచయితలు

ప్రొద్దుటూరు : సాహిత్య కేదారంలో అలుపెరుగని నిత్య కృషీవలుడు కాశీవరపు వెంకటసుబ్బయ్య అని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన 'తుమ్మెద పదాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన నారాల రామారెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా మాండలిక భాషలో గ్రామీణ జీవితం ప్రతిబింబించే ఎన్నో కథానికలను కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించారన్నారు. ఆయన కలం నుంచి వచ్చిన ఈ తుమ్మెద పదాలు సమాజంలో మంచిని పెంచడమే ధ్యేయంగా రాశారని పేర్కొన్నారు. ప్రముఖ కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ మనిషి మానసిక వికాసానికి ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ అనువాద రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ సమాజంలోని వింత పోకడలు, విపరీత భావాలు, పెరిగిపోతున్న ధన ప్రభావం, కనుమరుగవుతున్న బంధాలు, చెడును ఖండిస్తూ మంచిని ఈ పుస్తకంలో ఆవిష్కరించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యేలా నీతిని, రీతిని బోధించేలా ఈ 'తుమ్మెద పదాలు'లో సమాజ హితాకాంక్షత్వం దర్శనమిస్తున్నదని తెలిపారు. పుస్తక సమీక్షకులు కొత్తపల్లి శీను మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, చెడు, స్వార్థం, తప్పుడు ఆలోచనలను ఖండిస్తూ, మంచిని ప్రబోధిస్తూ, మనిషి మనుసులో మంచిని ప్రతిష్టించడమే లక్ష్యంగా తుమ్మెద పదాలు పుస్తకాన్ని కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించారన్నారు. ఈ పుస్తకాన్ని రచయిత హేమాద్రి సాగర్‌కు అంకితమిచ్చారు. అనంతరం సాహితీ వేత్తలు, రచయితలు కాశీవరపు వెంకటసుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీవీ సురేష్, గోపాల్‌నాయక్, పల్లా రామారావు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, రాజేంద్ర కుమార్, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

నేడు పుష్పగిరిలో వేలం పాటలు

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ఉదయం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త డి.వెంకటసుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ, కొబ్బరి కాయల విక్రయ హక్కుల కోసం ఈ వేలం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పాల్గొనే వారు తలనీలాల సేకరణ హక్కుకు రూ.50 వేలు, కొబ్బరికాయల విక్రయ హక్కుకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి వుంటుందని తెలిపారు. వేలం ముగిసిన వెంటనే పాట దక్కించుకున్న వారు మొత్తాన్ని చెల్లించాలని, లేకుంటే వారు కట్టిన డిపాజిట్‌ను అపరాధ రుసుం కింద దేవస్థానానికి జమ చేయడంతోపాటు వేలం పాట తిరిగి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేలం పాట దక్కించుకున్న వారు ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి 2025 అక్టోబర్ 31 వరకు ఏడాది పాటు హక్కును పొందుతారని తెలిపారు. కావున ఆసక్తి వున్న వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

సక్రమంగా జరిగేనా?

పుష్పగిరి శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం జరగాల్సిన బహిరంగ వేలం పాట పారదర్శకంగా జరగడం సందేహాస్పందంగా మారింది. వేలం ప్రక్రియలో దేవదాయ శాఖ అధికారులు అవలంబిస్తున్న చర్యలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. పుష్పగిరిలో తలనీలాల సేకరణ హక్కు, కొబ్బరి కాయల విక్రయ హక్కు కోసం ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఓ పత్రికలో ప్రకటన ఇవ్వడంతోపాటు కరపత్రాల ద్వారా ప్రచారం చేసిన దేవదాయ శాఖ అధికారులు ఎక్కడా లేని విధంగా ఒక రోజు ముందుగానే 21వ తేదీన వేలం పాట నిర్వహించారు. కేవలం టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వేలం పాటలో ఇతరులెవరూ పాల్గొనకుండా చేసి.. ఆ పార్టీ మద్దతుదారులకు తక్కువ మొత్తానికే అప్పనంగా హక్కులను కట్టబెట్టడానికే దేవదాయ శాఖ అధికారులు ప్రకటించిన తేదీ కంటే ఒక రోజు ముందుగా వేలం పాట నిర్వహించడానికి సిద్ధపడినట్లు తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆలయాల ఆదాయాలను పెంచి అభివృద్ధికి పాటు పడాల్సిన అధికారులే దేవుడి ఆదాయానికి గండి కొట్టడానికి ప్రయతి ్నంచడం విమర్శలకు తావిచ్చింది. ఈ క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. ఎట్టకేలకు తిరిగి సోమవారం వేలం పాట నిర్వహించనున్నారు. అయితే ఈసారైనా దేవదాయ శాఖ అధికారులు వేలంపాటను పారదర్శకంగా నిర్వహిస్తారా లేక పరోక్షంగా తక్కువ మొత్తానికే అధికార పార్టీ మద్దతుదారులకు కట్టబెట్టడం ద్వారా వారి పట్ల ఉన్న భక్తిని చాటుకుని.. శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ వైద్యనాథేశ్వరస్వాముల ఆదాయాలకు ఎక్కడ గండి కొట్టడానికి ప్రయత్నిస్తారోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

'సీమ'కు సంపద జానపద కళలే



మూలె రామమునిరెడ్డిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : రాయలసీమకు కళలు, వాటిని సృజించి పోషిస్తున్న శ్రామికులు అపూర్వమైన సంపదగా భావించాల్సి ఉందని విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ మూలె రామమునిరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెల నెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో 137వ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'రాయలసీమ జానపద కళావైభవం' అనే అంశంపై డాక్టర్ మూలె రామమునిరెడ్డి ప్రసంగించారు. సభాధ్యక్షత వహించిన సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ జానపద సాహిత్యం, కళలు నిత్యజీవితంతో ముడిపడినవన్నారు. స్త్రీలు ప్రదర్శించే కళలకు సంబంధించిన కొన్ని పాటలు పాడి విశ్లేషించారు. అనంతరం వక్త రామమునిరెడ్డి మాట్లాడుతూ మన దేశం వ్యవసాయ ప్రధానమైనదని, శ్రమను మరవడానికి మౌఖిక సాహిత్యం పుట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆయన జానపద సాహిత్యం, రీతులు గురించి సోదాహరణంగా వివరించారు. జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెడుతున్న జానపద కళారూపాలను గురించి తెలియజేశారు. హరికథలు, బుర్రకథలు, యజ్ఞగానం, తోలు బొమ్మలు, రంగస్థల నాటకాలు తదితర పరిణామాల గురించి తెలిపారు. అనంతరం వక్తను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసిన భర్త

చర్చిలో ప్రార్థన చేస్తుండగా ఘటన



మేరీని ఆస్పత్రికి తీసుకువెళుతున్న సహచరులు



చికిత్స పొందుతున్న మేరీ

జమ్మలమడుగు : భార్యపై అనుమానం పెంచుకున్న భర్త బ్లేడ్‌తో.. ఆమె గొంతు కోసిన సంఘటన ఆదివారం జమ్మలమడుగులో చోటుచేసుకుంది. పట్టణంలోని ఎస్సీ కాలనీలో మేరీ, విజయ్ దంపతులు నివసిస్తున్నారు. విజయ్ ఆటోలో కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానం పెంచుకున్నాడు. ఆమెతోపాటు ఆదివారం టౌన్ చర్చికి వచ్చాడు. ప్రార్థన చేస్తున్న సమయంలో విజయ్ తనతోపాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో భార్య గొంతు కోశాడు. ఆమె ఒక్కసారిగా కేకలు వేయడంతో చర్చిలో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. గొంతు, మెడ దగ్గర తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం ఎక్కువగా అవుతుండటంతో.. స్థానికులు గుడ్డను గొంతుకు కట్టి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

మొదటి భార్య చనిపోవడంతో రెండో వివాహం

మొదటి భార్య చనిపోవడంతో విజయ్ ఎస్సీ కాలనీకి చెందిన మేరీని 15 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగపిల్లలు. ఒకరు పీఆర్ ఉన్నత పాఠశాలలో, మరొకరు గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. రెండో వివాహం కావడంతో భార్య మేరీపై అనుమానం పెంచుకున్నాడు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడిచినా.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ప్రకటించి, వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు, కరువుభత్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు, సీపీఎస్ ఉద్యోగులకు కరువు భత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. సరెండర్ లీవ్ బకాయిలు, ఏపీజీఎల్ఐ బకాయిలు, పీఎఫ్ రుణాలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వల్ల ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి వెంటనే పదోన్నతులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగుమాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదన్నారు. బోధనకు ఆటంకం కలిగించే అనవసర యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, వీవీ రమణారెడ్డి, సీకే శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఆదిశేషారెడ్డి, అన్వర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



సానియా మృతదేహం

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణం పొందింది. ఈ విషాద ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంగారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్ నగర్‌లో షామీర్ అనే వ్యక్తి నివాసముంటున్నాడు. ఆయన కుమార్తె సానియా(21) ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె సరిగా చదువుకోక పోవడమే కాకుండా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే టీవీ చూస్తుండటంతో.. తండ్రి షామీర్ కళాశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని మందలించారు. మనస్తాపానికి గురైన సానియా శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి తండ్రి షామీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సానియా మృతదేహాన్ని వేంపల్లె ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. సానియా మృతి ప్రేమ వ్యవహారమా లేక, చదువుపైన ఆసక్తి లేకనా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య



జనార్ధన్‌రెడ్డి (ఫైల్)

వేముల : మండలంలోని పెద్ద జూటూరు గ్రామానికి చెందిన రైతు కదిరి జనార్ధన్‌రెడ్డి (48) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురి కావడంతోపాటు వ్యవసాయానికి చేసిన అప్పులు ఎక్కువ అయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం జనార్ధన్‌రెడ్డి తోట వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తల్లి తులశమ్మ తోట వద్దకు వెళ్లి చూడగా.. అక్కడ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు ఆమె తెలిపింది. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య కళావతితోపాటు కొడుకు వంశీధర్ రెడ్డి, కుమార్తె వనిత ఉన్నారు. జనార్ధన్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



కొండారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

ఖాజీపేట (చాపాడు) : మండల పరిధిలోని సన్నపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమల కొండారెడ్డి(60) శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పొలం వద్దకు వెళ్లి పని ముగించుకుని బైక్‌లో ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో మిడుతూరు దళితవాడ వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొండారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆదివారం కొండారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.